
పాలడుగు వెంకటేశ్వరరావు

ఋణానుబంధరూపేణా పశుపత్నీసుతాలయాః-అందరికీ ఎప్పుడో ఒకప్పుడు అనుభవంలోకి వచ్చి, కర్కశమైన జీవితసత్యాలను విశదపరిచి, విరక్తి పెంపొందించే అంశమిది. హృదయం బద్దలై బతుకు బండలై ఆత్మహత్యకు సహితం ఒడిగట్టుతారు. అయినా మళ్లీ మమత చిగురిస్తూనేవుంటుంది.



# మాయమనసు

గుడ్డివెన్నెల కిటికీలోనుంచి గదిలో పడుతున్నది.

దూరాన టపాకాయలు మోగుతున్నాయి. ఉలిక్కిపడి లేచిన లలిత బద్ధకంగా పక్కకు తిరిగింది. వరండాలో సన్నగా మాటలు వినిపిస్తున్నాయి.

"సాయంత్రమనగా పడుకున్నారు. ఇంకా నిద్రలోనే ఉన్నట్టుంది. లేపమంటారా?"

"వద్దులే. రేపు మళ్లీ వస్తానుగా? మందులూ, అవీ వేళకి ఇస్తున్నారా?"

"ఊఁ."

"పెద్దడాక్టరు రోజూ వచ్చిపోతున్నారు కదా? పూర్తిగా తగ్గిందనుకుంటాను."

"చాలావరకు తగ్గినట్లేనండి."

"వళ్లూ, అవీ బాగా తీసుకుంటూనేవుందిగా?"

"తీసుకుంటున్నారు. లేచారేమో చూసివస్తాను."

"వద్దులే. నువ్వు వెళ్తే ఆ సవ్వడికి మెలకువ వస్తుందేమో!"

"మిమ్మల్ని దించి రమ్మంటారా, దూరం వెళ్లాలేమో?"

"నాకు ఇంకా పనివుంది. లలిత మధ్యలో

> **మన బ్రతుకులు మూణ్నాళ్ల ముచ్చటలే. ఇలాంటప్పుడే మనమెంత అల్పులమో తెలిసేది. అది తెలిసినీ, తిరిగి మాయలో పడుతుంది మనసు. అంతలోనే ఎన్నో తాపత్రయాలు పడతాము. అందుకే మనుషులు అన్నారు మనల్ని!**

లేచి ఏమైనా అవసరం అయితే ఇబ్బంది కదా! అయినా నేను ఎప్పుడు వెడతానో నాకే తెలియదు!"

కాస్సేపు నిశ్శబ్దం. "మరి నేను వస్తాను. ఏమైనా అవరం పడుతుందేమో! రేపు వస్తానని చెప్పు."

మెత్తగా అడుగులు పడిన చప్పుడు. లలిత తలెత్తిచూసింది. అప్పటికే అతను వెళ్లిపోయాడు.

డ్రయివరు లోపలికి వచ్చాడు. "మీరు లేచారా? భాస్కరంగారు వచ్చారు. మీరు లేస్తారేమోనని చూసి ఇప్పుడే వెళ్లారు. పిలవమంటారా?" అని గుమ్మంవైపు అడుగు వేయబోయాడు.

"వద్దు, వద్దు!" ఆత్రుతగా అని, వెంటనే సిగ్గుపడిపోయింది లలిత.

ఆశ్చర్యంగా ముఖంపెట్టి నిలబడిపోయాడు డ్రయివరు.

"పొద్దుపోయింది. ఆయన కోసం ఇంటివద్ద కనిపెట్టుకుని వుంటారు!" తన పనిని సమర్థించుకుంటున్నట్టుగా గొణిగింది లలిత.

అన్నీ అందుబాటులో వుండేటట్టు అమర్చి, లలిత చెప్పినమీదట, కారులో పడుకోవటానికి వెళ్లిపోయాడు డ్రయివరు. ఎండిన అతని జుట్టు తెల్లగా మెరిసింది లైటు వెలుతురులో. నాన్న చిన్నప్పటి నుంచీ పనిచేస్తున్నాడు తమ వద్ద. పాతరోజుల మనిషి.

నర్సు వచ్చి మందుఇచ్చి వెళ్లిపోయింది. నిద్ర రావడం లేదు. ఏమీ తోచడం లేదు. ఎవరైనా దగ్గరవుండి కబుర్లు చెబితే బాగుండును!

స్టూలు మీద చంద్రం బావ దగ్గరనుంచి వచ్చిన ఉత్తరం పడివుంది. అది వచ్చి నాలుగు రోజులవుతున్నది. ఇంకా తెరిచి చూడనేలేదు. అది తియ్యాలంటేనే విసుగనిపిస్తుంది. అందులో చూడటానికేముంటుంది? తన గొడవలు తప్ప, ఎదుటివాళ్ల కష్టం అర్థంకాని మనిషి ఏమి వ్రాస్తాడు? అందుకే తనకు ఇంకా దాని మొహం చూడబుద్ధి కావడంలేదు.

"అయినా నేను ఇక్కడుండిమాత్రం చేసేదేముంది? డాక్టరుతో మాట్లాడతాను. ఇంకో నెలరోజులలో డిశ్చార్జి చేస్తారుట. నువ్వు ఆలోచనలు మాని కులాసాగా వుండాలి!" అన్నాడు చంద్రంబావ.

అతని మొహంలో విసుగుదల తను అర్థం చేసుకోగలిగింది. నాన్నగనుక వుండివుంటే బావ ఇలా అనగలిగివుండేవాడేనా? ఆయనను చూడగానే తనకెంతో సంతోషమైంది. కనీసం ఒక పదిరోజులైనా వుంటాడుగదా అని ఆశపడింది.



చేతిలో డబ్బుంది గనుక అన్నీ అమరుతున్నాయి. కానీ, తనచుట్టూ ఇంతమంది జనం తిరుగుతున్నా, తనకు ఒంటరితనం అనిపిస్తోంది. భయంతో తను బాధపడుతున్నది. చంద్రంబావ నాలుగురోజులుండి, డాక్టర్లతో మాట్లాడి ఏర్పాటుచేస్తే తనకెంతో బలంగా వుంటుంది. ఆ సంగతి చెబుదామనుకుంటూండగానే అంతా తనే నిర్ణయించేశాడు.

"ఊటీ వెళ్లాలని మీ అక్క నెలరోజుల నుంచీ ప్రయత్నం చేస్తున్నది. ఆవిడకి ఈ ఎండలు భరించలేనంత బాధ కలిగిస్తున్నాయట. బయల్దేరుదామనుకుంటూ వుండగానే, భాస్కరం వ్రాసిన ఉత్తరం అందింది. అప్పుడే తెలిసింది -నువ్వు ఇక్కడ వుంటున్నట్టు. పాపం, చిన్నవయస్సులోనే నీకీ జబ్బు ఏమిటని వాళ్లూ మద్రాసులో బాధపడ్డారు. వాళ్లనటు పంపించి నేను ఇటువచ్చాను. వాళ్లంతా మద్రాసులో నాకోసం ఎదురుచూస్తూవుంటారు.

"ఈ ఉద్యోగాల్లో పడి ఇద్దరం చెరొక దారీ అయిపోయాము. అందుకే భాస్కరానికి వ్రాశాను 'ఇలా బయలుదేరుతున్నాము. అందరం కలిసి కొన్నాళ్లు గడిపిరావచ్చు. మీరుకూడా రావలసింది' అంటూను. కానీ, సమాధానమే లేదు. ఆ విషయమే ఇందాక ఆఫీసులో అడిగితే నవ్వి ఊరుకున్నాడు. వాడెప్పుడూ అంతే. తనకిష్టం లేకపోతే ఒకళ్ల మాటని అంతగా పట్టించుకోడు. తన మనసులోని మాటని అంత త్వరగా బయటపడనీయడు."

తనకు విసుగేసింది. "నేను వ్రాసిన ఉత్తరం అందలేదా, బావా?" అని ఆ ప్రవాహాన్ని మధ్యలో ఆపివేసింది.

బావ కొద్దిగా ఆశ్చర్యపడ్డాడు. "అందలేదే! ఆ మధ్యన కాంప్‌కి వెళ్లాను. ఒకవేళ పిల్లలు తీసి ఎక్కడైనా పడేశారేమో?" అన్నాడు. "భాస్కరం చూశావా? వాడు చిన్నప్పుడు ఎంత బాగావుండేవాడు! పాపం, బాగా చిక్కిపోయాడు. చెంపలూ, అవీ లోపలికి పోయాయి. 'ఏమిరా' అంటే, ఏమీ లేదని అంటాడు. మా మరదలి నడుగుదామా అంటే ఇంటికి వెళ్లటానికే టైము లేకపోయింది!"

ఎంతసేపూ తన గొడవా, పిల్లల గొడవా, తమ్ముడి గొడవాతప్ప, ఈ మనిషికి ఇంక ఏమీ పట్టవా? ఇన్ని రోజుల నుంచీ హాస్పిటల్‌లో వుండి జబ్బుతో తీసుకుంటూవున్న తన దగ్గరకు ఈ మనిషి ఎందుకు వచ్చినట్టు? సొంతగొడవలు చెప్పి మరింత చికాకు కలిగించటానికా? ఏమి మనుషులు! ఇన్నాళ్లనుంచీ దిక్కులేదుగానీ, తమ్ముడు భాస్కరం కొద్దిగా చిక్కాడని ఎంతగానో ఇదైపోతున్నాడీ మనిషి! అవును, కడుపులో లేనిది కావలించుకుంటే మాత్రం ఎక్కణ్నించి వస్తుంది?

"నువ్వు ధైర్యంగా వుండాలి. భాస్కరం చూసిపోతుంటాడులే మరి. నాకు టైమైంది, వెళ్లిరానా?" అన్నాడు చంద్రం బావ.

నోరు పెగలక, తల ఆడించింది తను.

పంచ అంచుల్ని సుతారంగా చేత్తో పట్టుకుని నడిచివెళ్లాడతను.

ఈ మనిషినేనా, తాను పెద్దదిక్కుగా భావించి సహాయపడతాడని ఆశించింది? తన అసహాయతకు జాలిపడి అసహ్యించుకుంది, ఇంకేమీ చెయ్యలేక! తన సంగతి ఎవరికి పడుతుంది? తనకన్నీరు ఎవరి హృదయం కరిగిస్తుంది? నా అనేవాళ్లు ఎవరున్నారు తనకు? తను ఎవరికి కావాలి? గుండెలో దిగులు క్రుంగదీస్తుంటే, జాలిపడి నిద్రాదేవి తనను ఒడిలోకి తీసుకుంది.

మధ్యాహ్నం మూడుగంటలకు నిద్రలేచింది తను.

ఎదురుగా స్టూలుమీద కూర్చుని బత్తాయిపండు ఒలుస్తున్నాడు భాస్కరం. "బాగా నిద్రపోయినట్టుంది. కళ్లు ఎర్రగా అయ్యాయి!" అన్నాడు నవ్వుతూ.

అతని నవ్వు ముళ్లు గుచ్చినట్టుంది తనకు.

ఈ కథను ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 3.11.1965 సంచికలో ప్రచురించాము

లేచి మొహం కడుక్కుని వచ్చేసరికి ఫ్లాస్కులో కాఫీ వంచి గ్లాసు అందించాడు. తీసుకోక తప్పలేదు తనకు.

ఇతను ఏమి మొండిమనిషి! అతను ఇక్కడికి రావడం తనకిష్టం లేదని ఎలా తెలియచెయ్యటం? ఇతనికి తనమీద ఏమీ కోపం లేదా? అతని మీద తనకు ద్వేషం వుందని గ్రహించలేదా?

"అన్నయ్య మధ్యాహ్నం బండికి వెళ్లిపోయాడు. సెలవుపెట్టి రైలెక్కించివచ్చాను. 'నువ్వు బాగా చిక్కిపోయా'వంటున్నాడు" అన్నాడు.

తను మౌనంగా వుండిపోయింది.

"పండగ నాటికి నిన్ను డిశ్చార్జి చేస్తారట. ఇప్పుడు బాధ తగ్గిపోయిందిగా పూర్తిగా?" అన్నాడు.

తల ఊపింది తను.

"పాపకి మధ్యాహ్నం పూట సెలవు అవటం బాగానే వుంది. నీకూ తోస్తూనేవుందిగా?"

తల ఊపింది తను. తన మనసులో వున్న బాధంతా వెళ్లగక్కి, 'దీనికంతటికీ నువ్వే కారణ'మని అతన్ని నిందించాలని అనిపిస్తోంది. తన ద్వేషమంతా బయటపెట్టి, 'నువ్వు ఇక నా దగ్గరకు రానవసరం లేదు!' అని చెప్పేయాలనిపిస్తుంది. 'నీవు బాగానే వున్నావు కదా? ఇంకా నా వెంట ఎందుకు పడతావు? నన్ను నా మానానికి ఎందుకు వదిలిపెట్టవు?' అని అడిగేయాలని అనుకుంటుంది. కానీ భాస్కరాన్ని చూడగానే మనస్సు నాగస్వరాన్ని విని చేతలుడిగిన పాములవలె అయిపోతుంది. అతని ముందు తను నిస్సహాయ అయిపోతుంది. బహుశా, తన ఈ బలహీనతనే ఆధారంగా చేసుకుని భాస్కరం తనకన్యాయం చేశాడా?

అతన్ని వదిలించుకునే దారి లేదా? అతన్ని రమ్మని ఎవరు అడిగారు అసలు? అతను కాస్సేపు కూర్చున్నాడు మౌనంగా. తను ఇన్నాళ్ల నుంచీ గమనించలేదు గానీ, భాస్కరం బావ నిజంగానే చిక్కిపోయాడు. కళ్లు లోతుకుపోయి, చుట్టూ నల్లనిగీతలు ఏర్పడ్డాయి. చెంపలు లోనికి తోసుకునిపోయాయి. వంకీలు తిరిగివున్న నల్లటిజుట్టులో అక్కడక్కడా తెల్లవెంట్రుకలు తొంగిచూస్తున్నాయి. చంద్రం బావ అన్నమాట నిజమే!

"ఏమైనా అవసరం పడితే డ్రయివర్ని ఇంటికి పంపించు!" అని వెళ్లిపోయాడు బావ. అతను నడుస్తూంటే నీరసంగా వున్నట్టనిపించింది తనకు, పాపం!

"నువ్వు చూడలేదేమో, భాస్కరం వచ్చాడు. ఒక్కడే. వాడిమీద మామూలు ఆప్యాయత చూపలేకపోయాను. వెళ్లేటప్పుడు చెప్పడానికి వచ్చాడు. నేను మాట్లాడలేదు. చిన్నబుచ్చుకున్నాడేమో!" అన్నారు నాన్న. 'నేను ఊళ్లు తిరుగుతున్నాను. అందువల్ల లలితపెళ్లి సంగతి తెలియలేదు. బెజవాడలో అన్నయ్య కనిపించి చెప్పాడు. అటునుంచి ఇటే వచ్చాను' అన్నాడు భాస్కరం. కానీ వాడికేం తెలుసును మనం కావాలనే వాడికి తెలియనివ్వలేదని!" బాధపడ్డారు నాన్న.

"పోనీలే నాన్నా! ఎవరికెవరు? మనం బాధపడినప్పుడు ఎవరికి పట్టింది?" అంది తను ఆ విషయాన్ని అక్కడితో తుంచివేస్తూ. కానీ, అతను తన చేత ఇంకా గట్టిగా అవమానితుడయ్యాడని ఆయనకేమి తెలుసును? పిచ్చినాన్న! మేనల్లుడి మీద ఇంకా మమత చంపుకోలేకపోతున్నాడు.

వైభవోపేతంగా జరిగిపోయింది తన పెళ్లి. కావాలని పంతంకొద్దీ వెతికి, భాస్కరం తలదన్నినే సంబంధం తెచ్చి అట్టహాసంగా చేశారు నాన్న.

ఆ సాయంత్రం తను ఒక్కర్తీ గదిలో కూర్చునివున్నది. వయస్సు మళ్లిన బంధువు ఒకావిడ వచ్చిచెప్పింది-"భాస్కరం వెడుతున్నాడట. నీతో చెప్పడానికి వచ్చాడు" అని.

తనకు విసుగేసింది. భాస్కరం వచ్చాడన్నమాట! 'అంతా చూసి ఈర్ష్యతో కుళ్లిపోతూవుండివుండాలి! అయినా ఎందుకు వచ్చాడు తను? ఎవరు పిలిచారు?' అని మండిపడింది లోలోపలే. తలుపు కిందనుంచి అతని పాదాలు కనబడుతున్నాయి. అతను వినాలనే గట్టిగా, కసిగా అంది-"వెడుతున్నాడా? పోనీలే. నాకు ఇప్పుడు బాగా అలసటగా వుంది. నిద్రపోతున్నానని చెబుదూ! అంత చెప్పాల్సిందేమిటి?" అని.

ఆవిడ ఆశ్చర్యంగా కాసేపు చూసి, తరువాత బయటికి వెళ్లిపోయింది.

అవమానంతో పాలిపోయిన అతని మొహం చూసి ఆనందించాలనే చిత్రమైన కోరిక కలిగి, కిటికీ సందులలోనుంచి చూసింది తను. కానీ మొహం కనబడలేదు. వెళ్లిపోతున్న అతని వీపు, వెనుకభాగం మాత్రం కనిపించాయి. అతను వెళ్లిపోయాడు. ఆనాడు అంత అవమానం పొందినా ఆ మనిషికి తనమీద కోపం రాలేదా? చిత్రమైన మనిషి! అవును, చిత్రంగానే తనకు అన్యాయం చేశాడు. నమ్మించి ద్రోహం చేశాడు!


ఒకనాడు ఇదే మనిషి ఒంటరిగా తనను పట్టుకుని, చుట్టూ చేతులేసి, "లలితా! నువ్వు లేకపోతే నేను బతకలేను. నిన్ను నాలో కలిపేసుకోవాలనిపిస్తూవుంది. నేనింకా ఇలా ఎంతకాలం ఆగాలి? దొంగా! నన్నెందుకేడిపిస్తావు?" అన్నాడు దీనంగా.

తను జాలిపడి అతని వుంగరాల జుట్టు నిమిరింది. 'నా పిచ్చిబావా! నీది ఎంత మంచి మనసు!' అనుకుని ఆనందించింది.

తనను, కలల్లో కనిపించి ఎంతో అల్లరిచేసేవాడు. కాలేజీ నుంచి పెద్దపెద్ద ఉత్తరాలు రాస్తూవుండేవాడు. అవి ఎంతో అందంగా వుండేవి. మనస్సును మధురలోకాల్లోకి నడిపించుకుని వెళ్లేవి. బావ మనసు కూడా అందమైనదే అనిపించింది తనకు. మనిషి రూపమే అతని జీవితసాహచర్యాన్ని ఊహించుకుని తను గాలిమేడలపై ఆనందవునరిహద్దుల వరకూ వెళ్లింది.

"అయిన సంబంధం. ఇద్దరూ ఇష్టపడ్డారు. ఈడూజోడూ బాగా కుదిరింది. పై ఏడాదికి వాడికి చదువు అయిపోతుంది. ఆ మూడుముళ్లూ వేయించి, అంతా వాళ్లకప్పగించేసి, నిశ్చింతగా కాలక్షేపం చేస్తాను!" అనేవారు తెలిసినవాళ్లతో నాన్నగారు.

కన్నెమనసులో దోబూచులాడే ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరి అయ్యేది తను. భాస్కరం బావతో



తన పెళ్లి అవుతుందని అనుకున్నారు అంతా. అంతా నిశ్చయమైనట్లే. ఎదురుచూస్తూవున్న ఆ ఏడాదీ ఇట్టే గడిచిపోయింది. నిరీక్షణల పొలిమేరలు దాటిపోయింది తను.

"భాస్కరం బావ ఉత్తరం రాశాడమ్మా! సెలవులిచ్చారట!" అన్నారు నాన్న ఒకసారి.

తన మనస్సు ఆనందంతో పొంగిపోయింది. 'అయితే బావ వస్తున్నాడన్నమాట!' అనుకుని.

"పాపం, తులసమ్మ తెలుసుగా? ఆవిడ పోయిందట. నువ్వెప్పుడో చిన్నప్పుడు చూసివుంటావు. మీ మామయ్యా, వాళ్ల తండ్రీ అన్నదమ్ములు. వాళ్లాయన దుర్వ్యసనాలు మరిగి ఆస్తిని నాశనం చేసిపోయాడు. విశాల అని-నీ వయసే వుంటుంది. క్కతే కూతురు. అదీ, సరిగా వుండక ఈ మధ్యన మెట్లమీద నుంచి జారిపడి కాలు విరగ్గొట్టుకుందట! 'ముందు అక్కడ దిగుతున్నాను. తరువాత ఒక వారం రోజుల్లో వస్తా'నని వ్రాశాడు."

'పోనీలే, వారం ఆగలేనా-ఇంతకాలమూ ఆగినదాన్ని!' అనుకుంది తను. కానీ, హృదయం ఎంతో ఆరాటపడింది. తను ఎదురుచూస్తూవున్న ఘడియ రానేవచ్చింది చివరికి. రిక్షా దిగి లోపలికి వచ్చిన తను ఆనాడు, హాల్లో నాన్నగారు, భాస్కరంబావ కూర్చునివుండటం గమనించి, తొట్రుపాటుతో లోపలికి పరుగెత్తబోయింది. నాన్నగారు పిలవడంతో సిగ్గుపడుతూ దగ్గరకెళ్లి నిలబడింది.

నాన్న మొహం ఎర్రగా కంది ఉంది. కళ్లు ఎర్రగా ఉన్నాయి.

కొంటెగా, తన మొహంలోకి చూడవలసిన బావ గంభీరంగా పైకి చూస్తున్నాడు. పలకరింపూ లేదు. "ఆ విషయం లలితకి చెప్పి, మరి నేను వెడతాను, మామయ్యా!" అన్నాడు బావ చివరికి.

నాన్నగారు తల ఊపి నిశ్శబ్దంగా తన గదిలోకి వెళ్లిపోయారు.

ఏమిటి ఈ మనిషి తనకు ఒంటరిగా చెప్పే విషయం? తను సిగ్గుతో కుంచించుకుపోయింది. కానీ, మరుక్షణం అతను చెప్పిన విషయం విని, నిశ్చేష్ట అయిపోయి, దీనంగా చూస్తూ నిలుచుంది. కన్నీరు బుగ్గల్ని తడిపివేసింది.

"లలితా! అలా జరిగిపోయింది. ఇది కేవలం విశాలమీద జాలి వలన జరిగింది. ఆ సంగతి నేను చెప్పుకోకూడదు కానీ, నీకు చెప్పకతప్పదు! ఇందులో నిన్ను మోసం చెయ్యాలనే ఉద్దేశ్యం ఏమాత్రమూ లేదు. ఆ క్షణం వరకూ అలా అవుతుందని నాకే తెలియదు. బాగా ఆలోచించిన మీదటనే ఇది జరిగింది. నేను దేనికోసం ఇలా చేశానో, స్తిమితంగా ఆలోచిస్తే నీకూ బోధపడుతుంది. నేను విశాలని పెళ్లి చేసుకున్నాను!" అన్నాడు.

ప్రేమతో పెంచుకున్న తన మొక్కను పీకివేసి, 'ఇది ఉంటే పాపం, ఆ చిన్న మొక్క చచ్చిపోతుంది. ఇది లేకపోయినా పరవాలేదు, దాన్ని పెరగనీయి' అని హితవు చెప్పినట్లయింది.

భాస్కరం ఇంత పిచ్చిపని చేస్తాడని తను కలలో కూడా అనుకోలేదు. పైగా, 'కావాలంటే నీకు నాకన్నా మంచి భర్త లభిస్తాడు. కానీ విశాల పరిస్థితి వేరు. ప్రయత్నిస్తే నన్ను మరచిపోగలవు. నన్ను క్షమించు, లలితా!' అన్నాడు. ఎంత తేలికగా అనగలిగాడు!

అయితే తను కట్టుకున్న మేడలన్నీ కూలిపోయినట్టేనా? ఇంత మోసం చెయ్యటానికి భాస్కరం మనసెలా ఒప్పింది? ఇతని మొహం చూడటానికి ఇష్టంలేక లోపలికి వెళ్లిపోయింది తను.

"తల్లీ, తండ్రీ లేరు. వెనుక ఆస్తిపాస్తులు లేవు. పైగా కుంటిపిల్ల. ఏమిటి చూసి నువ్వు లలితని కాదని విశాలని చేసుకున్నావు?" అని అడిగాడట నాన్న.

"అవును. ఆ పిల్ల గతి ఏమిటి? ఎవరు చేరదీస్తారు? అనిపించింది నాకూను-గుండెలు ప గిలేలా ఏడుస్తున్న విశాలను చూసి. కనుకనే అలా జరిగింది!" అన్నాడట. మనసారా నమ్మినందుకు ప్రతిగా, ఆ మనిషి తనలో అన్ని ఆశలు రేపి, ఆఖరికి నిరాశ చేసి, ఏమీ జరగనట్లు నటించి, 'బాధపడవ'ద్దని హితవు పలికి వెళ్లిపోయాడు. ఏమి మనిషి! అప్పటినుంచీ ఆ పేరు చెబితే తన నరనరాల్లోని రక్తం గడ్డకడుతుంది. ద్వేషంతో హృదయం మండిపోతుంది. మనసు అసహ్యంతో నిండిపోతుంది.

ఆ తరువాత ఏడాది తిరగకుండానే, పంతం కొద్దీ వెతికి, కావాలని భాస్కరం తలదన్నిన సంబంధం తెచ్చి వైభవంగా తను పెళ్లి జరిపించారు నాన్న. పిలవకనే, ఆ పెళ్లికి వచ్చిన భాస్కరానికి అంతకంటే ఎక్కువ మర్యాద జరగలేదు. అతనికి జరిగిన అవమానానికి, గాయపడిన తన మనసు తృప్తిపడింది.

కానీ సంవత్సరం తిరగకుండానే, తను భయంకరవిషాదంలో మునిగిపోవలసి ఉంటుందని కలలోనైనా అనుకోలేదు ఆనాడు.

తాళి గట్టిన మనిషితో ముచ్చటగా మూడురోజులైనా కాపురం చెయ్యలేదు. ఏకాంతంలో ఒక్క రహస్యమూ నివేదించనేలేదు.

ఒక భయానకమైన రాత్రి, వారు గుండెఆగి మరణించారని కబురు తెలిసింది. అంత మనిషీ, నాన్న నీళ్లు కారిపోయారు. ఏడ్చి, తన గుండె బండబారిపోయింది. తన నూరేళ్ల పసుపుకుంకుమలూ ఏడాదికే చెల్లిపోయాయి. అంత చిన్న వయసులోనే గుండెఆగి మరణించటమేమిటని అందరూ ఆశ్చర్యపోయారు. నమ్మలేని విషయాన్ని కళ్లారాచూస్తూ నమ్మక తప్పలేదు. అంతా అయిపోయింది.

తిరిగి వచ్చిన తరువాత నాన్న పూర్తిగా మారిపోయారు. "మనకి సరిగా తెలీదు. వాళ్ల ఆస్తినీ, హంగునూ చూసి మోసపోయాము. అతని అప్పటికే పూర్తిగా చెడిపోయాడట. తాగుడుకి అలవాటుపడి, అధికం కాగా గుండే, ఊపిరితిత్తులూ చెడిపోయాయట. పెళ్లి చేస్తేనైనా దారికి వస్తాడేమోనని, మనల్ని నమ్మించి ఈ పెళ్లి జరిపించారట! ఈ విషయాలు మొన్న తెలిశాయి. నీకు అన్యాయం జరిగింది, తల్లీ!" అని వాపోయారు నాన్న.

అటువంటి మనిషా తన భర్త? అతనితోనేనా తను తన కాపురాన్ని గూర్చి కోరికల గూడు కట్టుకున్నది?



"భాస్కరం తెలిసి నీకు అన్యాయం చేశాడు. నేను తెలియక నిన్ను గంగలో దింపాను!" అని కన్నీరుపెట్టుకుని జాలిగా చూసేవారు నాన్న. ఆ బాధతోనే మంచం పట్టి తనకున్న ఆ ఒక్క ఆధారాన్నీ తెంచివేసి తన దారి తను చూసుకున్నారు నాన్న. కన్నతల్లి చిన్నప్పుడే పోయింది. తెలిసివాళ్లు మోసం చేశారు. తండ్రి అర్థాంతరంగా పోయాడు. తను అనాథ అయింది.

పాతికేళ్లకే తన జీవితం ఎండిన మోడైపోయింది. చంద్రంబావా, వాళ్లూ వచ్చారు. తనని చూసి పరిహసించటానికి భాస్కరంకూడా వచ్చాడు. కానీ, ఎవరు ఏమనుకుంటే తనకేమి? తను కష్టాలలో మునిగిఉంది. మనసు మొద్దుబారి, గుండె బండరాయి అయింది. నిండా మునిగి ఉన్నదానికి చలేమిటి? దగ్గరగా వచ్చి, ఏమీ మాట్లాడలేకపోయేడు భాస్కరం కాస్సేపువరకూ. "ఇంత ఘోరం జరుగుతుందని కలలో కూడా అనుకోలేదు, లలితా!" అన్నాడు గద్గదకంఠంతో, నోరు పెగుల్చుకుని.

'ఇదంతా నువ్వు చేసిందేగా? నీ కోరిక తీరిందనుకుంటాను. ఇంకా నేను ఏమైపోతే నీకు ఇష్టమో చెప్పు!' అని బిగ్గరగా ఏడవాలనిపించింది. చాచి మొహంమీద కొట్టాలనిపించింది.

"ఎంతో అన్యాయం జరిగిపోయింది. చిన్న వయసులోనే ఇంత ఘోరం జరగటం పెద్దకష్టమే. ధైర్యంగా ఉండు. జరిగిపోయినదాన్ని గురించి ఆలోచిస్తూ మనసు చెడగొట్టుకోకు!" అన్నాడు.

"మనసు చెడగొట్టుకుంటే మాత్రం పోయిందేముంది, బావా?" అన్నది తను.

తనవంక ఆశ్చర్యంగా, జాలిగా చూశాడు. పంచదార పూసి మాటలు చెప్పటం ఎంత తేలిక ఇతనికి!!

ఇప్పుడు తనకు ఏ ఆశాలేదు, ఏ బాధాలేదు. తండ్రి మిగిల్చిపోయిన ఆస్తి ఉన్నది. అప్పుడప్పుడు కష్టం అనిపించినా, బాదరబందీ లేని జీవితం, అనుకున్నంత నికృష్టంగా లేదు. అటువంటి తనను చూసి ఎంతో ఆప్యాయతతో వచ్చి చేరింది ఈ రోగం.

పద్దన్నకొద్దీ బలవంతాన తీసుకునివచ్చి చేర్పించారు నాన్న స్నేహితుడు ఒకాయన. పాపం, ఆ వయసులో కూడా ఎంతో ఓర్పుతో అందర్నీ కలుసుకుని హాస్పిటల్‌లో స్పెషల్ వార్డులో చేర్పించారాయన. ఇంతలోనే భార్యకు జబ్బుగా ఉందని తెలియటంతో ఆయన వెళ్లిపోకతప్పలేదు. ఆయన ఎంతో బాధపడుతూ వెళ్లిపోయారు. ఎవరి గొడవలు వాళ్లను ముంచివేస్తున్న ఈ రోజులలో ఎవరు మాత్రం ఎన్నాళ్లని ఉంటారు, తనను కనిపెట్టుకుని?

మళ్లీ తనూ, తన ఒంటరితనమూను! నాన్నగారి కాలం నుంచీ కనిపెట్టుకుని ఉంటున్న డ్రైవరు రాఘవులే ఆసరాగా నిలిచాడు. ఒకసారి వచ్చిపొమ్మని చంద్రంబావకు మాత్రం ఉత్తరం రాసింది. ఆ పరిస్థితుల్లో ఒకనాడు హఠాత్తుగా పడక దగ్గరకు వచ్చి ఆశ్చర్యపడిపోయాడు భాస్కరం బావ. ఈ స్థితిలో తిరిగి భాస్కరం కంటబడటం తనకు ఎంతమాత్రం ఇష్టం లేదు. కానీ అదే జరిగింది!

"లలితా! నువ్వు ఇక్కడ ఎందుకు ఉన్నావు?" అన్నాడు.

ఏమని చెబుతుంది తను?

"నాకు నెలరోజుల క్రితమే ఈ ఊరు ట్రాన్స్‌ఫరైంది. ప్రస్తుతం ఇక్కడే ఉంటున్నాము. ఇప్పుడు వేరే పనిమీద స్నేహితుల దగ్గరకి వచ్చాను. దూరాన చూసి నువ్వో, కాదో అని సందేహపడ్డాను. ఆ అనుమానంతోనే దగ్గరకి వచ్చి చూస్తే నువ్వేను. ఎవరికీ చెప్పాపెట్టకుండా ఎందుకు చేరావు? మాట మాత్రం తెలిస్తే, నేను దగ్గర ఉండి చూసేవాడిని కదా?" అన్నాడు.

డాక్టరునడిగి, తనే విషయం తెలుసుకున్నాడు. రోజూ వచ్చిపోతున్నాడు తీరిక చేసుకుని.

'నువ్వు రావడం నాకు ఇష్టం లేదు. నా ప్రాణానికి నన్ను వదిలిపెట్టు! ఇంతవరకూ చేసిన సహాయానికి కృతజ్ఞురాలిని!' అనాలనిపిస్తుంది, అతనితో. కానీ, అలా అనటానికి నోరు రావటంలేదు. అందరూ కఠినంగా ఉండలేరుగదా? అంత మంచివాడనుకున్న చంద్రం బావే, కష్టసమయంలో నాలుగు రోజులు ఉండి ఆదుకోలేకపోయాడు. ఇక్కడ తను హాస్పిటల్‌లో బాధపడుతూ ఉంటే, తన ఊటీ ప్రయాణం వాయిదా వేసుకోలేకపోయాడు. ఎవరి కష్టసుఖాలు వారివి. ఎవరి దారి వారిది. బాధపడి ప్రయోజనం ఏమిటి? అటువంటిది, తన జీవితానికే వెన్నుపోటు పొడిచి, బ్రతుకును మోడు చేసిన భాస్కరం తనను ఏమి ఉద్ధరించేటట్టు? అతను రావడం వలన గతస్మృతులు రేగి, మరింత బాధ కలగడం తప్ప ప్రయోజనం ఏమిటి?


ఊర్మిళ నిజంగా మంచిపిల్ల. అమాయకత నిండిన ఆ పాప మాటలు మంచితనానికి మాటలు. అలాంటి పాపకు భాస్కరం తండ్రిగా తగడు. ఒకనాడు దిక్కులేనిదనుకున్న విశాల ఈనాడు ఏ స్థితిలో ఉన్నది? తను ఇక్కడ ఉంటున్నదని తెలిసీ ఒకసారైనా చూడటానికి రాలేదు. ఏం? ఎందుకు రావాలి? భాస్కరం గనుక ఇన్ని జరిగినా, తనకు ఎంత వద్దని అనిపించినా తన దగ్గరికి వచ్చి అన్నీ విచారించిపోతున్నాడు. రావద్దని నోరువిప్పి చెప్పినా వినేలాగు లేడు.

భాస్కరం పిచ్చివాడు. ఆ మనిషినేనా తను అంతగా అవమానించింది? అయినా అతను అదేమీ పట్టించుకోడేమి? అతన్ని ఏమని అర్థం చేసుకోగలదు తను? విశాల నిజంగా అదృష్టవంతురాలు!

"పిన్నీ! ఎందుకు దిగులుగా ఉంటావు?. సంతోషంగా ఉంటే త్వరగా నయమవుతుంది" అంటూంది ఊర్మిళ. "నీకు త్వరగా నయమైతే మా ఇంటికి వెళ్లిపోదాము. నీకు ఇష్టమేనా?" అని అడుగుతుంది.

ఆ ఇంటికి వెళ్లే గీతే తనకు ఉంటే, అది ఎప్పుడో జరిగి ఉండేది. ఊర్మిళ తన పాపే అయి ఉండవలసింది. ఈనాడు దిక్కులేనట్టు ఇలా హాస్పిటల్‌లో పడిఉండేది కాదు తను. పాపం, పసిది, దానికేం తెలుసు?

అవును. తను దిక్కులేనిది. నా అన్నవాళ్లు ఎవరూ లేరు. తనకోసం బాధపడి రెండు కన్నీటిబొట్లు విడిచే ఆప్తులు లేరు. తన స్థితిని



గమనించే, భాస్కరం ఇంకా తనను వదలకుండా వెంటబడి వెక్కిరిస్తూ వగ సాధిస్తున్నాడు.

అమాయకురాలైన ఊర్మిళను వంపి, ఇంకో అనుబంధం సృష్టించి, మరేదో నాటకానికి నాంది వలుకుతున్నాడు. అమాయకంగా ఉన్నట్టు నటించి తనకు ద్రోహం చెయ్యటానికి పథకం వేస్తున్నాడు. ఇతని బారినుండి తనకు రక్షణ లేదా? భాస్కరం మనిషి కాదు, రాక్షసుడు!

లలిత కంట నీరుకారి బుగ్గల్ని తడిపేసింది. అన్నీ తన పిచ్చి ఆలోచనలు గానీ, భాస్కరం తనను ఏమి చెయ్యగలడు? తనకు ఇవ్వాటికే జీవితంమీద ఏ ఆశా లేకుండా పోయింది. తను కావాలనుకుంటే ఇప్పుడే చచ్చిపోగలదు. అంతా తన చేతుల్లోనే ఉంది.

'రాత్రులు నిద్రవట్టడం లేదు' అంటే ఎన్నో జాగ్రత్తలు చెప్పి ఇచ్చారు డాక్టరుగారు. ఆ మాత్రలు ఒక అరడజను మింగి మంచినీళ్లు తాగి వడుకుంటే తనకు నిద్రలోనే శాంతి. శాశ్వతశాంతి! ఈ ఒంటరితనం, గతస్మృతుల బాధలు, భాస్కరం తనను ఏమి చెయ్యగలవు?

ఇంత మంచి ఉపాయం చేతుల్లో ఉండగా తనకీ పిచ్చి ఆలోచనలెందుకు? నవ్వుకుంది పొడిగా. నిద్ర మాత్రల పొట్లం తలగడ క్రింద పెట్టి మంచినీళ్లు తాగింది లలిత. వడుకునేముందు ఆ వని చేసెయ్యాలి. అవ్వుడే తనకు శాంతి! దేన్ని ఆశించి తను మళ్లీ లేచి తిరగాలి?

వాచీ చూసుకుంది లలిత. పదకొండు గంటలైంది. ఆఖరిసారిగా, ఆ ఉత్తరంలో చంద్రం ఏమి వ్రాశాడో చూడాలనిపించింది. కవరు తీసి, చించింది.

ఉత్తరం చదువుతూ అలాగే ఉండిపోయింది. చదివిందే మళ్లీమళ్లీ చదివింది ఆశ్చర్యంతో. లైటార్పి వడుకోవటానికి ప్రయత్నించింది. ఇంత పొద్దుపోయినా నిద్ర రాదు.

దూరంగా నక్కలు అరుస్తున్నాయి. మబ్బులు తినేసిన వెన్నెలలో, మొహం వెలవెలపోయి, భోరుమని ఏడిచింది రాత్రి.

భాస్కరం బావ ఏమి మనిషి! జరిగిన సంగతి మాటమాత్రం చెవ్వటానికి అతనికి ఎందుకు అభ్యంతరం? ఇన్నాళ్లనుంచీ వస్తూ ఉన్నాడు. సందర్భవశాత్తూ అయినా చెవ్వవచ్చును కదా? హఠాత్తుగా, వరిచితమైన అడుగుల సవ్వడి విని, లేచి లైటు వేసింది లలిత.

వెనుదిరిగి పోబోతున్నవాడల్లా వెనక్కు తిరిగాడు భాస్కరం. "వేరే వనిఉండి, ఇవ్వటిదాకా హాస్పిటల్‌లోనే ఉండిపోయాను. నీ గదిలో ఇంకా లైటు వెలుగుతూఉంటే చూసిపోదామని వచ్చాను!" అన్నాడు సంజాయిషీ ఇస్తున్నట్టు.

అతని వంక జాలిగా చూసింది లలిత. "రా, బావా!" అంది నోరు పెగుల్చుకుని.

అతని కళ్లు నిద్రలేమితనం సూచిస్తున్నాయి నీరసంగా.

"ఊర్మిళ రావటంలేదు?" అంది లలిత ఏదో మాట్లాడాలి గదా అని. అతను మాట్లాడలేదు.

"మాట్లాడవేం బావా? పావకీ నేనంటే అసహ్యమేసిందా?" అంది బాధగా లలిత.

"లేదు! దానికి ఒంట్లో బాగాలేదు. ఇప్పుడు నీకు పూర్తి స్వస్థత చిక్కిందనుకుంటాను. రేపో, ఎల్లుండో డిశ్చార్జి చేస్తారు!" అన్నాడు.

"విశాలని ఒక్కసారీ తీసుకురాలేదేం, బావా? ఆవిడ రానందా? లేక నీకే ఇష్టంలేదా, మేమిద్దరం మాట్లాడుకోవటం? ఇంత కాలం నుంచీ నేను ఇక్కడ వడిఉన్నాను గదా? ఒకసారి వచ్చి వెళ్లటానికైనా తీరిక దొరకలేదా తనకి?" నిష్ఠురంగా అంది.

"కొన్ని కారణాల వలన తను రాలేకపోయింది. ఆ విషయం నీకు తరువాత చెబుతాను. డిశ్చార్జి అయిన తరువాత, కొన్నాళ్లపాటు ఏ కాశ్మీరో వెళ్లివస్తే బావుంటుందేమో! ఏమాలోచిస్తున్నావు?" అన్నాడు మాటమారుస్తూ.

"ఒంటరిదాన్ని, నేను అవన్నీ ఎలా తిరగగలను? కొన్నాళ్లు ఇక్కడే ఉండి వెడదామనుకుంటున్నాను. నాలుగు రోజులపాటు నాకాశ్రయమివ్వలేవా? విశాల ఏమైనా అంటుందని భయమా?" వరిశీలనగా అతని మొహం చూస్తూ అంది లలిత.

బాధగా మొహంపెట్టి కాస్సేవు మౌనంగా ఉండిపోయాడు భాస్కరం. "లేదు, లలితా! నువ్వు కొన్నాళ్లు ఇక్కడే ఉంటావని నిజంగా అంటే నాకంటే సంతోషించేవాళ్లు ఉండరు. విశాల హృదయపూర్వకంగా స్వాగతమిస్తుంది నీకు!" తొట్రుపాటుతో మాటలు నిలదొక్కుకుంటూ అన్నాడు.


లలితకు ఉవ్వెత్తున కోసం పొంగివచ్చింది. రోషంతో ముక్కుపుటాలదిరాయి. "నువ్వు అబద్ధాలు కూడా ఆడతావని నాకు ఇంతవరకూ తెలియదు! నిన్ను నువ్వు వంచించుకుంటూ నన్నూ ఎందుకు వంచించటానికి ప్రయత్నిస్తావు? ఎవరిని మోసం చేద్దామని?" అని విసురుగా ఆ ఉత్తరం అతనికిచ్చింది, "చంద్రంబావ వ్రాశాడు" అని గొణుగుతూ.

తీసుకుని అతను చదివాడు. అతని మొహంలోకే చూస్తూ ఉన్న లలిత కన్నుల్లో నీరు తిరిగింది. అతని మీద అమితంగా జాలివడింది లలిత.

"లలితా! నేను మళ్లీ వచ్చి నిన్ను చూద్దామని అనుకున్నాను. కానీ ఈ బాదరబందీలో వీలుకాలేదు. కానీ అక్కడ నన్నాశ్చర్యంలో ముంచివేసే సంగతి ఒకటి తెలిసింది. ఇక్కడ ఒకాయన తటస్థవడి వరిచయమయ్యాడు. మాటలమధ్య, అతను భాస్కరానికి స్నేహితుడని తెలిసింది. కొంతకాలం క్రితంవరకూ ఇద్దరూ ఒకచోటే వనిచేస్తూ ఉండేవారట. ఈ విషయం నాకు భాస్కరం ఎందుకు చెవ్వలేదో అర్థం కావటంలేదు. మొన్నకూడా వచ్చిన వెళ్లాడు గదా! మూడేళ్ల క్రితం విశాల మగపిల్లవాడిని ప్రసవించి చనిపోయిందట. తరవాత ఆ బిడ్డకూడా పోయిందట. ఎంత ప్రయత్నించినా నాకు నమ్మబుద్ధి కావటంలేదు. కానీ ఇవతల ఈ విషయం చెబుతున్నది ఒక పెద్దమనిషి: వీలైనంత త్వరలో వచ్చి తమ్ముడిని చూడాలనిఉంది. నువ్వు ఎప్పుడు డిశ్చార్జి అవుతున్నావు?

"ఇట్లు చంద్రం."

ఉత్తరం చదివి దీర్ఘంగా నిట్టూర్చాడు



భాస్కరం.

"నిజమేనా, బావా?" గద్గదకంఠంతో అంది లలిత.

"పసిపిల్లవాడి వంటి మనస్సు అన్నయ్యది. గాభరా మనిషి. నువ్వు అసలే కష్టంలో ఉన్నావు. చెప్పటానికి ఇది నలుగురూ విని ఆనందం పంచుకునే విషయం కాదు గదా? ఊరుకున్నాను, నిదానంగా చెప్పవచ్చుని. తను పోయింది. ఎంతో ప్రయత్నించాను. కానీ విశాలని దక్కించుకోలేకపోయాను." భాస్కరం గొంతు బొంగురుపోయింది.

లలిత మౌనంగా ఉండిపోయింది. మనస్సులో ఏవో ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నాయి.


వరండా చీకట్లో ఆలోచిస్తూ కూర్చున్నాడు భాస్కరం. వంటవాడు బయట నుంచుని దీనంగా చూస్తున్నాడు పిల్లలు ఆడుకుంటూంటే.

ఇంటిముందు కారు ఆగిన శబ్దం వినిపించింది. ఆశ్చర్యంతో బయటికి వచ్చాడు భాస్కరం. కారు తలుపులు తీసుకుని బయటికి వస్తున్న మనిషిని చూసి స్తంభించి అలాగే నిలబడిపోయాడు.

"అదేమిటి బావా, తెల్లబోయిచూస్తావు? ఎలా వచ్చాననా? కావాలనుకుంటే ఎట్లాగైనా రావచ్చు!" అంది లలిత దగ్గరికి వచ్చి.

డ్రైవరు సామాను తీసి లోపల పెడుతున్నాడు.

"నువ్వు రేపు కదా డిశ్చార్జి అయ్యేది? నిన్ను తీసుకురావటానికి నేనే వద్దామనుకుంటున్నాను.




డాక్టరుగారు ఒప్పుకున్నారా?" నీరసంగా అన్నాడు భాస్కరం.

"ఆఁ, ఒప్పుకోకేంచేస్తారు? అంతా అయిపోయిందిగా? పండగనాడు కూడా ఇంకా అక్కడే పడి ఉండట మేమిటనిపించింది. ఇవాళ ఊర్మిళ ఒక్కతీ అయిపోతుంది కదా? పసిపిల్ల! పాపం, దానికేమి చాతనవుతుంది? అన్న ఆలోచన వచ్చింది. ఇవాళే రావాలనిపించింది. పెద్ద డాక్టరుగారినడిగాను. సరేనన్నారు. ఆ సంతోషంలో బజారుకి పోయి, మధ్యాహ్నం నుంచీ ఇన్ని మందులు కొని రెడీమేడ్ షాపులో పాపకి బట్టలు తీసుకుని ఇప్పటికి బయటపడ్డాను. ఇవాళ ఆ మందులన్నీ నువ్వూ, ఊర్మిళా కాలిస్తే నేను చూడాలి. అన్నట్టు... పాప ఏదీ? లోపల ఉందా? ఊర్మిళా!" అంటూ లోపలికి దూసుకుపోయింది లలిత.

వంటవాడు లైటు వేసి బావురుమని ఏడుస్తూ కింద కూర్చుండిపోయాడు.

"బావా! ఊర్మిళ ఏదీ? బయటికి వెళ్లిందా? ఒక్కదాన్నీ ఎందుకు పంపించావు?" అంటూ వచ్చిన లలిత,. దీనంగా మొహంపెట్టి కుర్చీలో వాలిపోయి ఉన్న భాస్కరాన్ని చూసి భయపడిపోయింది.

"మాట్లాడవేమిటి, బావా? నాకు భయం వేస్తున్నది!" అంటూ ఏడుపు మొహం పెట్టిన లలితకు వంటవాడు ఏడుస్తూ చెప్పాడు.

"పాప గారికి వారం నుంచీ టైఫాయిడంట, ఆ జ్వరం. బొమ్మలాగా తిరుగుతూ ఉండే అమ్మాయిగారు అన్యాయంగా అట్లా పడిపోయారు. ఆ వారం రోజులూ అయ్యగారికి నిద్రా, తిండీ లేవు. ఎంతమందికో చూపించారు. ఎన్నో చేశారు. ఎంతో బాధపడ్డాము. 'అమ్మా... నాన్నా... పిన్నీ...' అని కలవరిస్తూ చిట్టితల్లి అన్యాయం చేసిపోయింది మూడురోజుల కిందట, మమ్మల్నొదిలిపెట్టి!" రెండు చేతులతో మొహం కప్పుకున్నాడు వంటవాడు.

పొంగివచ్చే దుఃఖంతో రోదిస్తూ, కన్నీటితో ముఖం తడిసిపోతూఉండగా భాస్కరం పాదాల వద్ద వెక్కుతూ కూలబడిపోయింది లలిత.

నిశ్శబ్దంగా ఏడుస్తూ నడిచింది కాలం, కొన్ని నిమిషాలసేపు.

భాస్కరం కన్నీరు తుడుచుకున్నాడు. "ఎంత పిచ్చివాడినైపోయాను నేను!" అని గొణుక్కున్నాడు. "లలితా! మరీ చిన్నపిల్లవైపోతున్నావేం? పిచ్చిదానా! నన్ను ఓదార్చవలసిందిపోయి నువ్వే గుండెలు పగిలేటట్టు ఏడుస్తున్నావా? నీ ఆరోగ్యం అసలే బాగాలేదు. ఇట్లాగే బాధపడితే మళ్లీ చెడుతుంది. లే! అంతా అట్లా జరగాలని ఉంది కాబోలు. ఈ వారం రోజులూ నేనూ ఎంతో తాపత్రయపడ్డాను. బాధపడ్డాను. కానీ, ఊర్మిళని దక్కించుకోలేకపోయాను. విరక్తి చెంది చచ్చిపోదామని ప్రయత్నించాను. చచ్చి ఏమి సాధించను? భగవంతుడు జన్మ ప్రసాదించింది బలవంతంగా చావటానికి కాదు గదా?

"మన బ్రతుకులు మూణ్నాళ్ల ముచ్చటలే. ఇలాంటప్పుడే మనమెంత అల్పులమో తెలిసేది. అది తెలిసినీ, తిరిగి మాయలో పడుతుంది మనసు. అంతలోనే ఎన్నో తాపత్రయాలు పడతాము. అందుకే మనుషులు అన్నారు మనల్ని!" అంటూ భుజాలు పట్టుకుని లేవదీసి మంచం దగ్గరకి చేతులమీద తీసుకువెళ్లాడు లలితను భాస్కరం.

ఎదురింటి గోడమీద దీపం కొడిగట్టి ఆరిపోబోయింది. అంతలోనే గాలికి కొడి రాలిపోయింది. దీపం మళ్లీ నూనె పీల్చి వెలుగులు వెదజల్లసాగింది.

మౌనంగా కాలం పరుగెత్తింది. పదకొండున్నరైంది.

"లలితా! నిద్రపో! మళ్లీ నేను వెళ్లాలి. ఎల్లుండి వస్తాను. ఉదయమే అన్నీ సర్దుకుని ఉండు!" అని వెళ్లిపోయాడు లైటారేపి భాస్కరం.

చాలాసేపటివరకూ ఆలోచిస్తూ పడుకుంది లలిత. ప్రయత్నించినా నిద్ర రాలేదు. పాపం, విశాల పోయిందా? బావకు ఎంత కష్టం వచ్చింది?! ఈ మనిషిని గురించేనా తను భయపడింది? బావ చిక్కిపోవటానికి కారణం ఇదే అయిఉంటుంది. అంత బాధలో ఉన్న అతన్ని తను ఎంత వివరీతంగా ద్వేషించింది? "నేను వట్టి పిచ్చి మనిషిని!" అని గొణిగింది లలిత.

రాత్రి బద్ధకంగా దొర్లిపోయింది, వెనుక పండుగ తరుముకుని వస్తూండగా. ఆరోజే దీపావళి. నల్లటి రాత్రి. వీధుల్లో మంచి చీకటి చెల్లాచెదరవుతూంది. ఊరంతా సందడిగా ఉంది. మందుగుండు సామాను పెద్దపెద్ద శబ్దాలతో పేలుతున్నది. వెలుతురుకు భ్రమసి పురుగులు సమీపించి కాలి మసిఅయి రాలిపోతున్నాయి.

■